క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ వీరభద్రనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు, 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించగలరని ఆయన కోరారు.

ఇంటింటికి తాగునీరందిస్తాం

మీర్‌పేట మేయర్ దుర్గ



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న మేయర్

మీర్‌పేట: ఇంటింటికి నల్లా ద్వారా తాగునీరు అందించడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. కార్పొరేషన్ పరిధి 35వ డివిజన్ ప్రశాంత్‌నగర్ ఫేజ్–2లో రూ.7.50 లక్షలతో, 36వ డివిజన్‌లోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీలో రూ.2 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ పనులను శుక్రవారం మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి సహకారంతో కార్పొరేషన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, జలమండలి ఏఈ వివేక్, స్థానిక నాయకులు జి.విజయ్, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం శానిటేషన్ సిబ్బందికి నిత్యవసర సరుకులను మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది సేవలను కొనియాడారు. సిబ్బంది సేవల కృషి వల్లనే దేశంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లలో స్వచ్ఛ సర్వేక్షన్ విభాగంలో 4వ స్థానం దక్కించుకుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీఈఈలు అశోక్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులను తగ్గించండి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా



అవగాహన కల్పిస్తున్న నర్సింహారెడ్డి

మీర్‌పేట: అధిక ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శుక్రవారం రాత్రి మీర్‌పేట కార్పొరేషన్ పరిధి వెంకటగిరి కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అధిక పన్నులు, నీటి బిల్లుల గురించి కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, అశోక్, మనోహర్, సిద్దాల శ్రీశైలం, కీసర యాదిరెడి గంగమ్మ, లలితమ్మ, ఉమా, ఆనంద్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీవైఎఫ్ టీంకు క్రికెట్ కిట్ పంపిణీ

ఇబ్రహీంపట్నం: బండలేమూర్ గ్రామానికి చెందిన బీవైఎఫ్ టీం (బంటీ యూత్ ఫోర్స్)కు ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కొని రాజు క్రికెట్ కిట్‌ను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చింతకింది వీరేశ్, విజయ్, శివప్రసాద్, శ్రవణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి

జెడ్పీటీసీ వెంకటేశ్

మాడ్గుల: మండలంలోని నాగిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్ బోరు వేయించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషిచేస్తానని వెంకటేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉప్పల వెంకటేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇక్కడ కామాటీలే డ్రైవర్లు

- కార్పొరేషన్‌లో చెత్త తరలించేందుకు 5 ట్రాక్టర్ల కేటాయింపు
- ఒక ట్రాక్టర్ మినహా మిగితా నాలుగింటికి కామాటీలే డ్రైవర్లు
- వచ్చీరాని డ్రైవింగ్‌తో ప్రమాదాలబారిన పడుతున్న వైనం
- శాశ్వత డ్రైవర్లను నియమించాలంటున్న ప్రజలు



మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం

మీర్‌పేట: పేరుకే మున్సిపల్ కార్పొరేషన్.. కానీ ఇక్కడ కామాటీలే డ్రైవర్లు... వచ్చీరాని డ్రైవింగ్‌తో ప్రమాదాలబారిన పడుతున్న కామాటీలు... వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను తరలించేందుకు గాను మొత్తం 5 ట్రాక్టర్లు ఉన్నాయి. ఒక్క ట్రాక్టర్‌కు మినహా మిగతా నాలుగు ట్రాక్టర్లకు డ్రైవర్లు లేకపోవడంతో కామాటీలే డ్రైవర్లుగా మారి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వచ్చీరాని డ్రైవింగ్‌తో కామాటీలు వాహనాలు నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇంత పెద్ద కార్పొరేషన్‌లో చెత్త తరలించే ట్రాక్టర్లకు ప్రత్యేకంగా డ్రైవర్లు లేకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇవేమి పట్టించుకోకుండా డ్రైవింగ్ వచ్చిన కామిటీలతోనే నెట్టుకొస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు..?

ఐదు ట్రాక్టర్లలో ఒక్క డ్రైవర్ మినహా మిగతా నాలుగు ట్రాక్టర్లకు కామాటీలే దిక్కు. గతంలో పలు ప్రమాదాల్లో డ్రైవర్లు గాయపడటంతో కామాటీలే వాహనాలను నడుపుతున్నారు. కామాటీలు వాహనాలను నడపొద్దన్న నిబంధన ఉన్నప్పటికీ అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదని.. వచ్చీరాని డ్రైవింగ్‌తో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని కార్మికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చెత్త తరలించే ట్రాక్టర్లకు ప్రత్యేకంగా డ్రైవర్లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైవర్లను నియమిస్తాం



సిబ్బంది కొరతతో పాటు గతంలో ఉన్న డ్రైవర్లు ప్రమాదాలబారిన పడి, ఆరోగ్య రీత్యా విధులకు హాజరుకాకపోవడంతో సిబ్బందిలోనే లైసెన్సు కలిగి డ్రైవింగ్ వచ్చిన వారిని ట్రాక్టర్ డ్రైవర్లుగా వినియోగించుకుంటున్నాం. చెత్త తరలించే ట్రాక్టర్లకు త్వరలోనే శాశ్వత డ్రైవర్లను నియమించేలా చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

డిపోలో సమస్యలను పరిష్కరిస్తా

మంత్రి సబితారెడ్డి



సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బంది

మహేశ్వరం: మహేశ్వరం ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్, ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు మంత్రిని ఆమె నివాసంలో కలిసి డిపోలోని సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరం ఆర్టీసీ డిపో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. తాను గతంలో మంత్రిగా ఉన్నప్పుడు మహేశ్వరంలో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేశానని గుర్తుచేశారు. ప్రజావసారాల మేరకు ప్రతి గ్రామం, పల్లె, తండాకు ఆర్టీసీ బస్సులను నడిపించాలన్నారు. డిపోలో అదనపు బస్సుల కోసం సీఎం కేసీఆర్, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారు. డిపోలో సిమెంట్ కాంక్రీట్ బెడ్ లేక మట్టి, కంకర లేస్తుండంతో బస్సులు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయని.. సిమెంట్ కాంక్రీట్ బెడ్‌ను వేయించాలని మంత్రిని డిపో అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి, డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, కార్మికులు శంకర్‌నాయక్, అక్తర్ పాషా, జితేందర్, కృష్ణ గౌడ్, కుమార్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.

పథకాల అమలులో వేగం పెంచండి

ఎంపీడీఓ రాఘువులు

మాడ్గుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాఘువులు అన్నారు. మండలంలోని ఇర్విన్, కలకొండ, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ రాఘువులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనాన్ని రుచి చూశారు. మూత్రశాలల నిర్వాహణ గురించి వాకబు చేశారు. ఆయన వెంట సీడీపీఓ సక్కుబాయి, ఏపీఓ నర్సింగ్, సూపర్‌వైజర్ జయమ్మ, టీఏలు, కార్యదర్శులు ఉన్నారు.

నేదునూరులో క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కందుకూరు: కందుకూరు మండలం నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్‌లో నెహ్రూ యువ కేంద్రం మహేశ్వరం బ్లాక్ యూత్ ఇన్‌చార్జి ముద్దంగుల శివకుమార్, స్థానిక సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్ లెవల్‌లో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ మంద జ్యోతిపాండు, వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించేలా అందరూ ప్రోత్సహించాలన్నారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఇషయ్య, సీఐ కృష్ణంరాజు, ఎస్‌ఐ కొండల్, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, వరలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, నాయకులు రూప్‌చందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లులు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

- మహిళా మండలి అధ్యక్షురాలు దుర్గాదేవి
- స్ఫూర్తి మహిళా మండలి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు



పోటీల్లో భాగంగా ముగ్గు వేస్తున్న మహిళలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి హుడా కాంప్లెక్స్‌లో స్ఫూర్తి మహిళా మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు రంగవల్లులు చిహ్నమని, రైతులు పండించిన పంటలు ఇంటికి వచ్చినప్పుడు మహిళలు సంతోషంగా ముగ్గులు వేస్తారని, పిండి వంటలు చేసి ఆనందంగా గడుపుతారని మహిళా మండలి అధ్యక్షురాలు దుర్గాదేవి వివరించారు. రంగవల్లుల పోటీలో పాల్గొన్న మహిళలకు ప్రథమ, ద్వితీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేశామని, పోటీల్లో 60 మంది పాల్గొన్నారని తెలిపారు. ముగ్గులు వేయడం మహిళకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేస్తున్నామని, స్త్రీలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అలాగే స్ఫూర్తి మహిళా మండలి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ని బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు లోకసాని కొండల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్ఫూర్తి మహిళా మండల కార్యదర్శి శ్రీదేవి, కోశాధికారి పద్మజ, విజయలక్ష్మి, శ్యామల, లోటస్ ల్యాప్ స్కూల్ ప్రిన్సిపాల్ లలితరెడ్డి, మల్లారెడ్డి, పూర్ణిమ, రాధా, శంకరన్, రమాదేవి, యోగా గురూజీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.



పద్మినికి బహుమతి అందజేస్తున్న అతిథులు

స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు

ఇబ్రహీంపట్నం: స్కీం వర్కర్లందరిని పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న డిమాండ్ చేశారు. దేశవ్యాప్త స్కీమ్ వర్కర్ల నిరసన కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నభోజనం, ఐకేపీ, వీఓఏలు, సర్వశిక్ష అభియాన్‌తో పాటు72 రకాల స్కీముల్లో దేశవ్యాప్తంగా కోటిమంది స్కీం వర్కర్లుగా పనిచేస్తారని తెలిపారు. రాష్ట్రంలో 3.5 లక్షల మంది స్కీం వర్కర్లు 40 సంవత్సరాలుగా ఆయా స్కీమ్ లో పనిచేస్తున్నారని చెప్పారు. అత్యంత కీలక పథకాల్లో పనిచేస్తున్న వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు స్కీం వర్కర్లకు పనిభారాన్ని పెంచుతున్నా ఇందుకు అనుగుణంగా వేతనాలు పెంచడంలేదన్నారు. రూ.26 వేలు కనీస వేతనం చెల్లించి.. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించి, ఒకే రకమైన సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కన్వీనర్ బుగ్గరాములు, ఎల్లేశ్, యాదగిరి, బాలమణి, పెంటమ్మ, పద్మ, యాదమ్మ, అండాలు ప్రేమలత, హంసమ్మ, శారదమ్మ పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి

కలెక్టర్‌కు జెడ్పీటీసీ అనురాధ వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ అనురాధ

ఆమనగల్లు: గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్‌సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి ఆమనగల్లు పట్టణంలో స్థలం కేటాయించాలని ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అమయ్‌కుమార్‌కు జెడ్పీటీసీ అనురాధ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఆమనగల్లు ప్రాంతంలో గిరిజనుల జనాభా అధికంగా ఉందని అందువల్ల గిరిజనుల దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణం కోసం పట్టణంలోని సర్వే నం 730, 732లో ఉన్న ప్రభుత్వ స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆమె వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, నాయకులు వెంకటేశ్, గణేశ్, రమేశ్ తదిరతులు పాల్గొనారు.

జీవన ఎరువులతో అధిక లాభాలు

వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి

కడ్తాల్: సాగులో పచ్చిరొట్ట ఎరువులు, భాస్వరం కరిగించు జీవన ఎరువుల వాడకంతో తక్కువ పెట్టుబడితో పాటు అధిక లాభాలను ఆర్జించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద క్లస్టర్ పరిధిలోని రైతులకు.. పచ్చిరొట్ట ఎరువు, భాస్వరంను కరిగించు జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. సాగులో రైతులు తప్పకుండా పచ్చిరొట్ట ఎరువులు, జనుము చల్లి.. పూత దశలో దున్నినట్లయితే వరిలో నత్రజని (యూరియా) వాడకాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. భాస్వరం కరిగించే బ్యాక్టీరియా ద్వారా భూమిలో ఉన్న భాస్వరం మొక్కలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తద్వార వరి పంటకు డీఏపీపై అదనపు ఖర్చులు తగ్గించుకోవచ్చని భాస్వరం మెరుగుపడుతుందన్నారు. జీవ నియంత్రణ ఉత్పత్తుల వాడకంతో భూమి మరింత సారవంతమవుతుందని వాయు, జల కాలుష్యాన్ని నివారించుకోవచ్చని తెలిపారు. అదే విధంగా సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని వివరించారు. సమావేశానికి హాజరైన క్లస్టర్ పరిధిలోని రైతులు, సాగుకు సంబంధించి వివిధ సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి, సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, సేవ్యానాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, రైతు బంధు గ్రామ కోర్డినేటర్ నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, రైతులు భిక్షపతి, వెంకటేశ్, జంగారెడ్డి, సత్యం, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిబంధనల మేరకే గడ్డి విత్తనాల పంపిణీ

వెటర్నరీ అసిస్టెంట్ గ్యార శేఖర్

మాడ్గుల: ఈనెల 5న 'సాక్షి' దినపత్రికలో 'గడ్డి విత్తనాలు పక్కదారి' అనే శీర్షికన వచ్చిన వార్తకు వెటర్నరీ అసిస్టెంట్ గ్యార శేఖర్ స్పందించారు. ఈ విషయమై ఆయన శుక్రవారం రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. రైతుల పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులు తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం గడ్డి విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి తనను మందలించలేదని వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చానని పేర్కొన్నారు. తాను ఆన్‌డ్యూటీలో ఉన్నందున ప్రజాప్రతినిధులకు సమాచారం, పత్రికలకు ప్రకటనలు ఇవ్వలేక పోయానని వెటర్నరీ అసిస్టెంట్ శేఖర్ వివరించారు. విత్తనాల విక్రయంపై తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు.

మంగమ్మది ప్రభుత్వ హత్యే

వైఎస్సార్‌టీపీ నేత అర్జున్‌రెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన మంగమ్మ హెదరాబాద్‌లోని కోఠి ఆస్పత్రిలో ప్రసవం అనంతరం గురువారం మృతిచెందింది. శుక్రవారం వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి చుక్కాపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంగమ్మ మృతదేహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మంగమ్మ మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మాటికి ఇది ప్రభుత్వ హత్యనేనని.. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వారిని ఆదుకోవాలన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ పావనికి సన్మానం

మంచాల: ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన మంచాల గ్రామానికి చెందిన మొగిలి పావని వెంకటేష్ దంపతులను శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రజకులకు తగిన ప్రాధాన్యత కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పావని భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, మండల అధ్యక్షుడు మల్లేష్, ప్రధాన కార్యదర్శి మొగిలి శ్రీశైలం, నాయకులు.. బాలయ్య, బాలరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల చెంతన మార్కెట్ సేవలు



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డితో మార్కెట్ కమిటీ పాలకవర్గం

మార్కెట్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిశారు. కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్పుల చంద్రయ్యతోపాటు సభ్యులు.. ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు మార్కెటింగ్ సేవలు మరింత చెరువ చేసేందుకు పాలకవర్గం కృషిచేయాలని సూచించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొచ్చేందుకు మార్కెట్ పాలకవర్గం శాయశక్తులా కృషి చేయాలన్నారు.

ఎస్‌టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ..

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూటీఎస్) క్యాలెండర్, డైరీని శుక్రవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దానగుణం కలిగి ఉండాలి

లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రతి ఒక్కరు దానగుణం కలిగి ఉండాలని లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం జంబుల రంగారెడ్డి వర్ధంతి సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చెన్నకిషన్‌రెడ్డి ప్రారంభించారు. చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ వీల్స్ ఆన్‌మీల్స్ అనే కార్యక్రమం ద్వారా అన్నదానం నిర్వహిస్తుందని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరు దానగుణం అలవరచుకోవాలని ఆయన సూచించారు. మానవసేవే మాధవసేవ అని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ అంజయ్య, సభ్యులు రమేశ్, మహేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఎంగలి బాలకృష్ణ, చంద్రశేఖర్, యాదయ్య, కండె ఓంకారం, పాషా, వీరబొమ్మ రామ్మోహన్, ఏలె శివకుమార్, లయన్స్‌క్లబ్ సభ్యురాలు సుధ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: క్రీడలతో శారీరక వ్యాయమంతో పాటు, స్నేహభావం పెంపొందుతుందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల్ మండలం బాలాజీనగర్ పంచాయతీ పరిధిలోని రేకులకుంట తండాలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమ్లీబీచ్యానాయక్, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, నాయకులు శ్రీశైలం, శ్రీను, పవన్‌కుమార్, అమర్‌సింగ్,హనుమస్వామి పాల్గొన్నారు.